క్లుప్తంగా

బాధిత కుటుంబానికి పరామర్శ



పరామర్శిస్తున్న మహేందర్‌రెడ్డి

తాండూరు రూరల్: మండలంలోని జినుగుర్తి గ్రామ సర్పంచ్ పటోళ్ల రత్నమ్మ భర్త పటోళ్ల యేసురెడ్డి అనారోగ్యంతో రెండు రోజుల క్రితం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి, ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి బుధవారం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఆయన వెంట పీఏసీఎస్ చైర్మన్ రవిగౌడ్, బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు పురుషోత్తంరావు, శేఖరయ్య,శ్రీనివాస్‌గౌడ్‌లు ఉన్నారు.

ముగిసిన కబడ్డీ పోటీలు

కొడంగల్ : పట్టణంలోని సిటిజన్ క్లబ్‌లో మూడు రోజులుగా జరుగుతున్న రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలు బుధవారంతో ముగిశాయి. యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిర్వహించిన కబడ్డీ పోటీలకు పలు ప్రాంతాల నుంచి 40 టీంలు పోటీ పడ్డాయి. యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కృష్ణంరాజు, తాలూకా అధ్యక్షుడు రెడ్డి శ్రీనివాస్, పలువురు నాయకులు పర్యవేక్షించారు. విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో పీఏసీఎస్ అధ్యక్షుడు శివకుమార్ గుప్త, సర్పంచులు రమేష్‌రెడ్డి, బాల్‌రెడ్డి, పీసీసీ సభ్యుడు మహ్మద్ యూసూఫ్, కాంగ్రెస్ పార్టీ మండల కమిటీ అధ్యక్షుడు ప్రశాంత్, సంజీవరెడ్డి పాల్గొన్నారు.

ఆలయంలో అన్నదానం

తాండూరు టౌన్ : పట్టణంలోని శ్రీధర్మశాస్త అయ్యప్పస్వామి ఆలయంలో ప్రతి బుధవారం మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు వెంకట్రావు, కేశవరెడ్డిలు పేర్కొన్నారు. దాత శ్రీసాయిమేధ విద్యాలయ కరస్పాండెంట్ పెరుమాళ్ల వెంకట్‌రెడ్డి సహకారంతో జరుగుతోందని తెలిపారు. బుధవారం వారి కుటుంబ సభ్యులతో అన్నదాన కార్యక్రమం ప్రారంభించినట్లు చెప్పారు. అయితే, ప్రత్యేక రోజుల్లో ఎవరైనా కూడా అన్నదానం చేయవచ్చన్నారు. ఏడాది పాటు ప్రతి బుధవారం అన్నదాన కార్యక్రమం నిర్వహించడానికి ముందుకు వచ్చిన వెంకట్‌రెడ్డిని అయ్యప్పభక్తులు, ఆలయ కమిటీ సభ్యులు అభినందించారు.

నిరుపేదలకు అండగా ఉంటాం

కుల్కచర్ల: నిరుపేదలకు పీఎస్‌పీఎస్ సంఘం ఎల్లప్పుడు అండగా ఉంటుందని ఆ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు రాఘవేందర్‌గౌడ్ అన్నారు. ఘనపూర్ గ్రామపంచాయతీ అనుబంధ గ్రామం సక్రియనాయక్ తండాకు చెందిన రైతు మన్యనాయక్ అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న రాఘవేందర్‌గౌడ్ బుధవారం అనుచరులతో కలిసి వెళ్లి బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం అందజేసి, వారిని పరామర్శించారు. కార్యక్రమంలో అంజనేయులు, చీపిరి రాములు, హన్మంతు నాయక్, టిక్యానాయక్, రాహుల్‌నాయక్, సీతమ్మ పాల్గొన్నారు.

విజేత టీంకు కప్ అందజేత

బషీరాబాద్: మండల కేంద్రంలో ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే నారాయణరావు ఆధ్వర్యంలో నిర్వహించిన క్రికెట్ టోర్నీ విజేతగా బషీరాబాద్ బాజీగర్ టీం నిలిచింది. వారం రోజుల పాటు 30 జట్లు తలపడ్డాయి. గురువారం బషీరాబాద్ బాజీగర్ టీం ఓల్డ్ ఐస్ యంగ్ టీంలు ఫైనల్‌లో తలపడ్డాయి. బాజీగర్ టీం విజేతగా నిలిచింది. వీరికి ఎస్‌ఐ వేణుగోపాల్‌గౌడ్, కాంగ్రెస్ సీనియర్ నేత వెంకటేశ్ మహరాజ్ టోర్నీకప్ అందజేశారు. కార్యక్రమంలో నాయకులు రోహిత్ మహరాజ్, ప్రజా ప్రతినిధులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

కుక్కలతో ఇబ్బందులు



అడిషనల్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

అనంతగిరి: వికారాబాద్ పట్టణంలో కుక్కలు వీరవిహారం చేస్తున్నాయని, వెంటనే చర్యలు తీసుకోవాలని బీఆర్‌ఎస్ యువ నాయకుడు రాజేందర్‌రెడ్డి కోరారు. బుధవారం వికారాబాద్‌లో ర్యాలీగా బయలుదేరి అడిషనల్ కలెక్టర్ రాహుల్‌శర్మకు వినతిపత్రం అందజేశారు. కుక్కల బెడద ఎక్కువడంతో పాటు పలు చోట్ల ప్రజలను కరిచి గాయపరుస్తున్నాయన్నారు. బయటికి రావడానికి ప్రజలు భయపడుతున్నారని అన్నారు. ప్రత్యేక చొరవ తీసుకొని కుక్కల బెడద లేకుండా చూడాలని ఆయన కోరారు.

'తెలంగాణ చరిత్ర' నిర్మాణం అభినందనీయం

అనంతగిరి: సురవరం ప్రతాప్‌రెడ్డి స్ఫూర్తితో తెలంగాణ సాంస్కృతిక చరిత్ర నిర్మాణంలో తెలంగాణ సారస్వత పరిషత్తు సాగిస్తున్న కృషి అభినందనీయమని ఆ సంఘం అధ్యక్షుడు ఆచార్య ఎల్లూరి శివారెడ్డి అన్నారు. 33 జిల్లాల చరిత్ర, సంస్కృతి, భాష, సాహిత్యం మొదలైన అనేక అంశాలపై ప్రచురిస్తున్న గ్రంథాల పరంపరలో రూపొందించిన వికారాబాద్ జిల్లా సమగ్ర స్వరూప గ్రంథావిష్కరణ కార్యక్రమం బుధవారం వికారాబాద్‌లో నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. ఇప్పటివరకు 15 జిల్లాల సమగ్ర స్వరూప గ్రంథాలు ఒక్కొక్కటి సుమారు 400 నుంచి 500 పేజీల వరకు పూర్తయ్యాయని మరో 5 జిల్లాల చరిత్ర, సంస్కృతి, గ్రంథాలు తుది దశలో ఉన్నాయని తెలిపారు.

ఎదురుచూపులు!

- పేదల డబుల్ బెడ్రూం ఇళ్లకు మోక్షం ఎప్పుడో?
- ఏళ్లు గడుస్తున్నా పురోగతి లేదు..
- కొత్త ప్రభుత్వం ఇస్తుందో లేదోనని ఆందోళనలో లబ్ధిదారులు



మూడు అంతస్తులతో నిర్మిస్తున్న డబుల్ బెడ్ రూం ఇళ్లు

కొడంగల్ : పట్టణంలోని గాంధీనగర్ సమీపంలో నిర్మిస్తున్న డబుల్ బెడ్రూం ఇళ్ల నిర్మాణం ఎప్పుడు పూర్తివుతుందోనని లబ్ధిదారులు ఎదురుచూస్తున్నారు. ఏళ్ల గడుస్తున్నా ఇళ్ల నిర్మాణంలో పురోగతి కనిపించడం లేదనే విమర్శలు వస్తున్నాయి. ఏళ్లుగా ఊరిస్తున్న డబుల్ ఇళ్ల నిర్మాణాన్ని త్వరలో పూర్తి చేసి లబ్ధిదారులకు కేటాయించాలని అఖిల పక్ష నాయకులు డిమాండ్ చేస్తున్నారు. డబుల్ బెడ్ రూం ఇళ్ల నిర్మాణంలో తీవ్ర జాప్యం జరుగుతోందని ఆరోపించారు. కొడంగల్‌కు మొదటి దశలో 300 ఇళ్లు మంజూరయ్యాయి. పట్టణంలోని గాంధీనగర్ సమీపంలో 168 ఇళ్లు, పట్టణ శివారులోని మిషన్ భగీరథ ప్లాంట్ దగ్గర 132 ఇళ్లను కట్టాలని అధికారులు భావించారు. 300 ఇళ్ల నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.16 కోట్లు మంజూరు చేసింది. గాంధీనగర్ సమీపంలో నిర్మిస్తున్న 168 ఇళ్లకు రూ.9 కోట్లు, మిషన్ భగీరథ దగ్గర నిర్మించే ఇళ్లకు రూ.7 కోట్లు కేటాయించారు. అయితే, నిధుల కొరత కారణంగా పనులు ముందుకు సాగడం లేదనే ఆరోపణలు ఉన్నాయి.

1246 మంది దరఖాస్తు

కొడంగల్ మున్సిపల్ పరిధిలోని కొడంగల్, పాత కొడంగల్, పాత కొడంగల్ తండా, గుండ్లకుంట, కొండారెడ్డిపల్లి, బూల్కాపూర్, ఐనన్‌పల్లి గ్రామాల ప్రజలు డబుల్ బెడ్రూం ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకున్నారు. గత ప్రభుత్వం ఆదేశాల మేరకు రెవెన్యూ అధికారులు దరఖాస్తులు స్వీకరించారు. మున్సిపల్‌తో పాటు అనుబంధ గ్రామాల నుంచి 1246 మంది లబ్ధిదారులు దరఖాస్తు చేసుకున్నట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు.



నిర్మాణంలో ఉన్న డబుల్ బెడ్ రూం ఇండ్లు

కాంగ్రెస్ ప్రభుత్వంలో రూ.5 లక్షలు

ప్రస్తుతం కాంగ్రెస్ అధికారంలోని వచ్చింది. కొడంగల్ నుంచి విజయం సాధించిన రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యారు. దీంతో కొడంగల్ దశదిశ మారే అవకాశం వచ్చింది. పేదలందరికీ న్యాయం జరుగుతుందని కాంగ్రెస్ పార్టీ నాయకులు చెబుతున్నారు. త్వరలో డబుల్ బెడ్ రూం ఇళ్ల విషయంలో అధికారులు పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటారని కాంగ్రెస్ నేతలు చెబుతున్నారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీ మేరకు ఇంటి స్థలం ఉన్న ప్రతి ఒక్కరికి రూ.5లక్షలు ఇవ్వడానికి కాంగ్రెస్ పార్టీ సిద్ధంగా ఉందని ముఖ్య నేతలు చెబుతున్నారు.

గ్రామాల అభివృద్ధికి కేంద్రం కృషి

బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కరణం ప్రహ్లాదరావు



కేంద్ర పథకాలపై అవగాహన కల్పిస్తున్న ప్రహ్లాదరావు

కుల్కచర్ల: గ్రామీణ ప్రాంత అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం ఎంతో ఆర్థిక సహకారం అందిస్తుందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కరణం ప్రహ్లాదరావు అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని చౌడాపూర్‌లో కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక సంక్షేమంపై 'వికసిత్ భారత్' ద్వారా వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామీణ మహిళల ఆర్థిక అభివృద్ధికి, చిన్న చిన్న వ్యాపారులకు బ్యాంకుల ద్వారా ఆర్థిక సహకారం అందిస్తోందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వాలు కేంద్రం అందించే సంక్షేమ పథకాల గురించి ప్రజలకు అవగాహన కల్పించకపోవడంతో, రాష్ట్ర ప్రభుత్వాలే వాటి పేరు మార్చి తమ పథకాలుగా చెప్పుకుంటున్నాయన్నారు. కార్యక్రమంలో కుల్కచర్ల సర్పంచ్ సౌమ్యారెడ్డి, మండల బీజేపీ అధ్యక్షుడు మైపాల్ ముదిరాజ్, భారత్ గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకులు అంజనేయులు, ఏపీఎం శోభ, సీసీ వెంకట్, సునితవెంకటయ్య, చౌడాపూర్ దళితమోర్చా జిల్లా కార్యదర్శి సంగం శ్రీనివాస్, చౌడాపూర్ సర్పంచ్ కొత్తరంగారెడ్డి, బీజేవైఎం మండల అధ్యక్షుడు శరత్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి రాజిరెడ్డి, ఉప సర్పంచ్ శివకుమార్, బీజేపీ మండల పార్టీ ప్రధాన కార్యదర్శి రాజశేఖర్, పాండు, మాసయ్య పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు పూర్తి చేయండి



సర్పంచ్‌కి వినతిపత్రం అందజేస్తున్న వ్యాపారులు

కుల్కచర్ల: మండల కేంద్రంలో అర్ధాంతరంగా నిలిపివేసిన సీసీరోడ్డు నిర్మాణం వల్ల తీవ్రంగా ఇబ్బందులకు గురవుతున్నామని కుల్కచర్ల దుకాణ సముదాయ సంఘం నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం కుల్కచర్ల గ్రామ సర్పంచ్ సౌమ్యారెడ్డికి సీసీరోడ్డును వెంటనే పూర్తి చేయాలని వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సీసీరోడ్డు ఒక భాగం పూర్తి చేయడంతో మరొక భాగం కంకర తేలి దుమ్ము ,ధూళి విపరీతంగా తమ దుకాణాల్లోకి వస్తుందని ఆరోపించారు. వాహనాలు ఎక్కువగా తిరగడం వల్ల రోడ్డు జాం అయ్యి ఇబ్బందికర పరిస్థితి తలెత్తుతుందన్నారు. సమస్యను త్వరితగతిన పరిష్కరించాలని కోరారు. లేని యెడల పెద్దఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో కిష్టయ్య, శేఖర్, రాకేశ్, కృష్ణ పాల్గొన్నారు.

నేటినుంచి ఎమ్మెల్యే పర్యటన

ఏర్పాట్లు చేసిన కాంగ్రెస్ నాయకులు

బషీరాబాద్: తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి నుంచి గ్రామాల పర్యటనకు శ్రీకారం చుట్టబోతున్నారు. గురువారం బషీరాబాద్ మండలంలోని ఏకాంబరి రామలింగేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజల అనంతరం గ్రామాల పర్యటన ప్రారంభిస్తారు. మూడు రోజుల పాటు బషీరాబాద్ మండలంలో పర్యటిస్తారు. మొదటి రోజు ఇస్మాయిల్‌పూర్, నీళ్లపల్లి, జలాల్‌పూర్, మర్పల్లి, పర్వత్‌పల్లి, హంక్యానాయక్‌తండా, బోజ్యానాయక్‌తండా, నవల్గా, గొట్టిగఖుర్దు, గొట్టిగకలాన్, బాద్లాపూర్, బాద్లాపూర్‌తండా, కుప్పన్‌కోట్, కాశీంపూర్ గ్రామాల్లో పర్యటించనున్నారని పార్టీ నాయకులు తెలిపారు. ఇందుకోసం ఏర్పాట్లు చేశారు.

ప్రజా సమస్యలపై ఫోకస్..

ఎన్నికల ప్రచారం తర్వాతా మొదటిసారి ఎమ్మెల్యే హోదాలో గ్రామాలకు వెళుతున్న మనోహర్‌రెడ్డి గ్రామాల్లోని సమస్యలపై ఎన్నికల్లో ఇచ్చిన హామీలపై దృష్టి సారించనున్నారు. ప్రభుత్వం కేటాయించిన రూ.10 కోట్ల ప్రత్యేక నిధులతో సమస్యల పరిష్కారానికి నిధులు కేటాయించనున్నారు.

రేపు బంట్వారం మండల సభ

బంట్వారం: ఈ నెల 19వ తేదీ (శుక్రవారం) బంట్వారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీపీ ప్రభాకర్ బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఉ.11 గంటలకు మండల పరిషత్ కార్యాలయంలో సభ ప్రారంభమవుతుందన్నారు. ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, ఆయా శాఖల అధికారులు సకాలంలో హాజరు కావాలని కోరారు.

టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జిగా నర్సింలు



బంట్వారం: టీడీపీ వికారాబాద్ నియోజకవర్గం ఇన్‌చార్జిగా ఆ పార్టీ బంట్వారం మండల అధ్యక్షుడు రొంపల్లి నర్సింలు నియమితులయ్యారు. ఈ సందర్భంగా బుధవారం ఆయన మాట్లాడుతూ.. నాపై నమ్మకంతో పదవి అప్పగించిన టీటీడీపీ పొలిటిబ్యూరో సభ్యులు, షాద్‌నగర్ మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింలుకు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్రంలో టీడీపీకీ పూర్వ వైభవం తేవడానికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తాన్నారు.

30 వరకు జంతు సంరక్షణ పక్షోత్సవాలు

అనంతగిరి: దేశవ్యాప్తంగా జంతు సంరక్షణ పక్షోత్సవాలను ఈనెల 14 నుంచి 30 వరకు నిర్వహిస్తారని జిల్లా పశువైద్యాధికారి డాక్టర్ అనిల్‌కుమార్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జంతు హింసకు పాల్పడకుండా, కరుణతో ఉంటూ వాటిని కాపాడుకోవాల్సిన అవసరం ప్రతి పౌరుడిపై ఉందన్నారు. 15 రోజుల పాటు జంతు సంరక్షణపై పలు కార్యక్రమాలు, అవగాహనలు నిర్వహిస్తున్నామన్నారు. ఈనెల 23న ప్రతి పశు వైద్యశాలలో పెంపుడు కుక్కలకు ఉచితంగా రేబిస్ వ్యాధి నిరోధక టీకాలు వేస్తారని వివరించారు.

పేదలను ఆదుకుంటాం

సర్పంచ్ కోళ్ల సురేశ్



ఆర్థిక సహాయం అందజేస్తున్న సర్పంచ్

దోమ : గ్రామంలో ప్రతి పేద కుటుంబానికి అండగా ఉంటామని సర్పంచ్ కోళ్ల సురేశ్ అన్నారు. బుధవారం మండలంలోని బొంపల్లి గ్రామంలో గ్రామానికి చెందిన ఎరుకలి ఎల్లమ్మ అనే మహిళా అనారోగ్యంతో మృతి చెందింది. విషయం తెలుసుకున్న సర్పంచ్ గ్రామ కాంగ్రెస్ పార్టీ నేతలతో కలసి మృతదేహానికి నివాళులర్పించారు. అనంతరం అంత్యక్రియల నిమిత్తం బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామంలో పేద కుటుంబాలను అన్ని విధాలుగా ఆదుకుంటామన్నారు. కార్యక్రమంలో గ్రామ కాంగ్రెస్ పార్టీ నేతలు అంతిరెడ్డి, గుడిసె రాములు, కుర్వరమేశ్, చాకలి భాస్కర్, ఇంతియాజ్, హైమద్, అప్పగాళ్ల రమేశ్ పాల్గొన్నారు.

ఓటరు జాబితా సవరణకు అవకాశం



మాట్లాడుతున్న తహసీల్దార్ విజయకుమార్

కొడంగల్ : ఓటరు జాబితా సవరణకు ఇంకా అవకాశం ఉందని కొడంగల్ తహసీల్దార్ విజయకుమార్ తెలిపారు. బుధవారం తహశీల్ కార్యాలయంలో అఖిలపక్ష నాయకులతో సమావేశం నిర్వహించారు. నియోజకవర్గంలోని అన్ని మండలాల తహసీల్దార్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కొడంగల్ తహసీల్దార్ మాట్లాడుతూ.. ఓటరు జాబితాలో మార్పులు చేర్పులు చేసుకునే అవకాశం ఉందన్నారు. ఈనెల 20, 21వ తేదీల్లో నియోజకవర్గంలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో బీఎల్‌ఓలు అందుబాటులో ఉంటారని చెప్పారు. ఓటర్లకు సంబంధించి పేరులో తప్పులు ఉన్నా అడ్రస్ మార్చినా ఇతర ఎలాంటి సమస్యలు ఉన్నా సంబంధిత బీఎల్‌ఓకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. అఖిల పక్ష నాయకులు ఈ విషయాన్ని ప్రజలకు వివరించి తప్పులను సవరించుకునే విధంగా సహకరించాలని కోరారు. 20, 21వ తేదీల్లో తప్పితే ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్లు వెంకటేశ్, దానయ్య, శ్రీనివాసులు, విజయకుమార్, పాండు, డిప్యూటీ తహసీల్దార్ శివకుమార్, అఖిల పక్షనాయకులు ఇందనూర్ బషీర్, ఎస్‌బీ గుల్షన్, మోహన్‌రావ్ పాల్గొన్నారు.

ఉద్యోగ అవకాశాలు కల్పిస్తాం

డీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న టీఆర్ఆర్

పరిగి: నియోజకవర్గ ప్రజలకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు తాను ఎల్లప్పుడు కృషి చేస్తానని డీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి అన్నారు. బుధవారం పట్టణ కేంద్రంలోని టీఆర్ఆర్ నివాసంలో తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి , రీజినల్ ఎంప్లాయిమెంట్ ఆఫీసర్ భవానితో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు జాబ్‌మేళా నిర్వహిస్తుందన్నారు. 23న పరిగిలో వివిధ కంపెనీల ప్రతినిధులతో హాజరుకానున్నారని తెలిపారు. గత ప్రభుత్వం ఉద్యోగాలు కల్పించడంతో పూర్తిగా విఫలమైందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం నెలల్లో ఉద్యోగ అవకాశాల కోసం జాబ్ మేళాను నిర్వహిస్తుందన్నారు. ప్రైవేటు రంగ ప్రముఖ కంపెనీలు జీఎంఆర్, హెటిరో, అపోలో లాంటి 50 కంపెనీలు 6500 ఉద్యోగాలు ఇచ్చేలా జాబ్ మేళాను ఏర్పాటు చేస్తుందన్నారు. కావునా పదో తరగతి పాస్ అయినవారు, డిగ్రీ, ఐటీఐ, డిప్లొమా లాంటి కోర్సులు పూర్తి చేసిన వారు జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి, రీజినల్ ఎంప్లాయిమెంట్ ఆఫీసర్ భవాని తదితరులు పాల్గొన్నారు.

అక్రమ కేసులు ఎత్తివేయాలి

సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు వెంకటయ్య



నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

పరిగి: భూ పోరాటాలు చేస్తున్న నాయకులపై అక్రమంగా ప్రభుత్వం పెట్టిన కేసులను ఎత్తివేయాలని సీపీఎం జిల్లా కారవర్గ సభ్యుడు వెంకటయ్య డిమాండ్ చేశారు. బుధవారం పట్టణ కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. జగిత్యాల జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ భూమిలో గుడిసెలు వేసుకుని నివాసముంటున్న పేదలందరికీ ఇళ్ల స్థలాలు ఇవ్వాలని పోరాటం చేస్తున్న వారిపై కేసులు నమోదు చేసి జైలుకు పంపించడం ఎంత వరకు సమంజసమన్నారు. జిల్లా కేంద్రంలోని సర్వే నంబర్‌లో 437లో సుమారుగా 387 ఎకరాల్లో 4 వేల మంది పేదలు గుడిసెలు వేసుకుని నివాసముంటే వారిని రాత్రికి రాత్రి రెవెన్యూ అధికారులు గుడిసెలకు నిప్పు అంటించి దగ్ధం చేయడంతో పేదల పక్షాన నిలబడ్డ 30 మందిపై అక్రమంగా కేసులు వేయడం ఏంటని ప్రశ్నించారు. సీపీఎం ఎల్లప్పుడు పేద ప్రజల పక్షాన నిలబడి పోరాటం చేస్తుందన్నారు. అక్రమంగా నమోదు చేసిన కేసులు ఎత్తివేసి వెంటనే వారిని విడుదల చేయాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు హబీబ్, సత్తయ్య, రఘురాం, రాంచెంద్రయ్య, రమేష్ పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యలపై ఆగ్రహం

- అధికారులపై ధ్వజమెత్తిన సభ్యులు
- విద్యుత్ సరఫరాపై నిలదీసిన సర్పంచ్‌లు
- అభివృద్ధి విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే సహించం
- ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

పెద్దేముల్: సమస్యలు పరిష్కరించని అధికారులు ఎందుకంటూ సర్వసభ్య సమావేశంలో సభ్యులు ధ్వజమెత్తారు. బుధవారం పెద్దేముల్ మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ అనురాధ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి హాజరయ్యారు. మొత్తం 17 అంశాలతో కూడిన అజెండాను సమావేశంలో ప్రవేశపెట్టారు. ఎంపీటీసీలు, సర్పంచ్‌లు అధికారుల పనితీరును ఎండగట్టారు. రైతులకు విద్యుత్ కనెక్షన్ల విషయంలో విద్యుత్ అధికారులు తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారని సర్పంచ్‌లు శివలీల, హైదర్‌లతో పాటు పలువురు సర్పంచ్‌లు ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. వ్యవసాయానికి విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను రైతులకు మంజూరు చేయడం లేదని దీంతో ఓవర్ లోడ్‌తో ట్రాన్స్‌ఫార్మర్‌లు కాలిపోతున్నాయని వాపోయారు. కాలిపోయిన ట్రాన్స్‌ఫార్మర్లను సరిగా మరమ్మతులు చేయకపోవడంతో మళ్లీ మళ్లీ కాలిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. కొత్త ట్రాన్స్‌ఫార్మర్ల కోసం డీడీలు చెల్లించిన విద్యుత్ శాఖ అధికారులు స్పందించడం లేదన్నారు. మండల విద్యుత్ ఏఈని ప్రశ్నిస్తే ఇన్‌చార్జి అంటూ తప్పించుకొంటున్నారని సమావేశంలో ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయమై ఎమ్మెల్యే స్పందిస్తూ రైతులు ఇబ్బందులు పడకుండా కావాల్సిన ట్రాన్స్‌ఫార్మర్లు, సామగ్రిని ఉన్నతాధికారులతో మాట్లాడి మంజూరు చేయించే బాధ్యత తనదని ఎమ్మెల్యే సభ్యులకు హామీ ఇచ్చారు. శిథిలావస్థకు గురైన ప్రభుత్వ పాఠశాలలతో విద్యార్థులకు ఇబ్బందులు పడుతున్నారని పలువురు సభ్యులు సభకు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల నిర్వహణ సరిగ్గా లేదంటూ ఎంఈఓ వెంకటయ్యను సర్పంచ్‌లు ప్రశ్నించారు. అలాగే, ఇసుక అక్రమ రవాణాను అధికారులు అడ్డుకోవడం లేదని రేగొండి సర్పంచ్ హైదర్ సమావేశంలో మాట్లాడారు. దీంతో ఎమ్మెల్యే స్పందిస్తూ నియోజకవర్గంలో అక్రమ రవాణా జరిగితే అధికారులు కఠినంగా వ్యవహరించాలని ఆదేశించారు. అలాగే ఇసుక, సుద్ద, నాపరాతి అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేస్తానన్నారు. కేంద్ర ప్రభుత్వం జాతీయ లైవ్‌స్టాక్ మిషన్ ద్వారా ఏడాది కాలంగా అన్ని వర్గాల రైతులకు 50 శాతం సబ్సిడీపై రూ.20లక్షల నుంచి రూ.1 కోటి వరకు గొర్రెలు, మేకలు, పందులు, కోళ్ల పెంపకానికి రుణాలు అందిస్తోందని ఆసక్తి గల రైతులు దరఖాస్తు చేసుకోవాలని పశువైద్యాధికారి సభ్యులకు సూచించారు. 50 శాతం సబ్సిడీ రుణాలు విషయం సమాచారం ఎందుకు ఇవ్వలేదని సభ్యులు నిలదీశారు. ఈ పథకం ఎప్పుడైనా దర ఖాస్తు చేసుకోవచ్చని గడువు తేదీ లేదని ఏఈ సమాధానం చెప్పారు. ఆర్‌అండ్‌బీ శాఖ మండలస్థాయి అధికారి సమావేశానికి హాజరుకాకుండా వర్క్ ఇన్స్‌పెక్టర్‌ను సమావేశానికి పంపడంతో ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామంలో సర్పంచ్ తీర్మానం లేకుండానే అభివృద్ధి పనులు చేస్తున్నారంటూ రుక్మాపూర్ సర్పంచ్ శివలీల ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామ పంచాయతీ పరిధిలో రెవెన్యూ అధికారులు ఇళ్ల పట్టాలు ఇచ్చారని ఈ విషయం తనకు సమాచారం ఇవ్వలేదన్నారు. మా హక్కులను హరించిన అధికారులపై కోర్టుకు వెళ్తానని సర్పంచ్ మండిపడ్డారు.

బిల్లులు చెల్లించేలా కృషి చేస్తాం .. ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

గ్రామ పంచాయతీల పదవి కాలం ముగుస్తున్న సర్పంచ్‌లకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా బిల్లులు చెల్లించేలా కృషి చేస్తానని ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి అన్నారు. రాబోయేది వేసవి కాలం కావడంతో సాగు, తాగునీటికి సమస్యలు తలెత్తకుండా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. పదవి కాలం ముగుస్తున్న సర్పంచ్‌లకు ఎమ్మెల్యే సన్మానించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ ధారాసింగ్, పీఏసీఎస్ చైర్మన్ లక్ష్మారెడ్డి, వైస్ ఎంపీపీ మధులత, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, అధికారులు తదితరులున్నారు.

ప్రతి ఒక్కరూ దైవభక్తి అలవర్చుకోవాలి

ఎమ్మెల్యేలు రామ్మోహన్ రెడ్డి, మనోహర్‌రెడ్డి



పోచమ్మ తల్లికి పూజలు చేస్తున్న ఎమ్మెల్యేలు

దోమ : ప్రజలు దైవభక్తిని అలవర్చుకోవాలని ఎమ్మెల్యేలు టి. రామ్మోహన్‌రెడ్డి, మనోహర్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం మండలంలోని కిష్టాపూర్‌లో పోచమ్మ తల్లి ఉత్సవాల్లో వారు పాల్గొని పూజలు చేశారు. సందర్భంగా వారు మాట్లాడుతూ.. సమాజంలో శాంతయుత వాతావరణం నెలకొనాలంటే విధిగా భగవంతుడ్ని ఆరాధించాలన్నారు. ప్రతి ఒక్కరూ భక్తితో ముందుకు సాగాలన్నారు. భక్తితో ఉంటే మంచి పనులు చేయాలనే ఆలోనలు వస్తాయని, నిత్యం భగవంతుడిని స్మరించుకుంటూ జీవనం సాగించాలన్నారు. అప్పుడే సుఖసంతోషాలు వర్ధిల్లుతాయని చెప్పారు. అనంతరం బొంపల్లి తండాకు చెందిన వినోద్ అనే వ్యక్తి నూతన మెడికల్ దుకాణాన్ని ఎమ్మెల్యే టి. రామ్మోహన్‌రెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు విజయ్‌కుమార్‌రెడ్డి, యూత్ అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ శాంతుకుమార్, జిల్లా అధికార ప్రతినిధి రమేశ్‌గౌడ్, సర్పంచులు సురేశ్, సత్యమ్మ, మాజీ ఎంపీటీసీ వెంకట్, కాంగ్రెస్ పార్టీ నేతలు పాల్గొన్నారు.

గురుకులాల్లో ప్రవేశానికి దరఖాస్తులు

అనంతగిరి: జిల్లా వ్యాప్తంగా ఉన్న మైనార్టీ గురుకుల విద్యా సంస్థల్లో వచ్చే విద్యా సంవత్సరానికి వివిధ తరగతుల్లో ప్రవేశానికి 18 నుంచి వచ్చే నెల 6వరకు దరఖాస్తులు చేసుకోవచ్చని జిల్లా మైనార్టీ సంక్షేమాధికారిణి సుధారాణి ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తును ఆన్‌లైన్‌లో లేదా టీ ఎంఆర్‌ఈఐఎస్ మొబైల్ యాప్‌లో చేయవచ్చన్నారు. వివరాలకు 9959746436ను సంప్రదించాలన్నారు.

జయశంకర్ విగ్రహం ధ్వంసం



నిరసన వ్యక్తం చేస్తున్న జేఏసీ నాయకులు

పరిగి: ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహం ధ్వంసం చేసిన వారిని కఠినంగా శిక్షించాలని జేఏసీ జిల్లా అధ్యక్షుడు ముకుంద నాగేష్ మండిపడ్డారు. ఈ నెల 16న కుత్బుల్లాపూర్ నియోజకవర్గం ఆల్విన్ కాలనీలోని ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహం ధ్వంసం కావడంతో బుధవారం పట్టణ కేంద్రంలోని తెలంగాణ చౌరస్తాలో నిరసన వ్యక్తం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. జయశంకర్ విగ్రహాన్ని పోలీసులు, ప్రజలు చూస్తుండగానే రాళ్లతో ధ్వంసం చేయడం దారుణమన్నారు. విగ్రహాన్ని ధ్వంసం చేసిన వారిని, విధుల పట్ల నిర్లక్ష్యం వహించిన పోలీసులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో విశ్వకర్మ సంఘ నాయకులు పాల్గొన్నారు.

టీఎస్‌యూటీఎఫ్ మండల అధ్యక్షుడిగా దశరథ్



పరిగి: టీఎస్‌యూటీఎఫ్ మండల అధ్యక్షుడిగా దశరథ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. బుధవారం పట్టణ కేంద్రంలో జిల్లా అధ్యక్షుడు వెంకటరత్నం మండల నూతన కార్యకవర్గాన్ని ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా దశరథ్, ప్రధాన కార్యదర్శిగా గంగాధర్, ఉపాధ్యక్షుడిగా జైపాల్, మహిళా ఉపాధ్యక్షులుగా మంజుల, కోశాధికారిగా అబ్దుల్ రహీంలను కమిటీ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం జిల్లా అధ్యక్షుడు మాట్లాడుతూ.. సంఘం సభ్యులు ఉపాధ్యాయుల సమస్యలపై పోరాటం చేయాలని సూచించారు.